
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అధికార మార్పిడితో జిల్లాలో అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే జిల్లా పోలీస్ కమిషనర్ శ్వేతను హైదరాబాద్‌కు బదిలీ చేసి ఆమె స్థానంలో డాక్టర్ అనురాధను సీపీగా నియమించారు. పోలీస్ బాస్‌తో మొదలై మండలస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐల దాకా ఈ బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. దీంతో జిల్లా పోలీసు శాఖలో బదిలీల కలవరం మొదలైంది.

పోలీసుల్లో బదిలీల కలవరం



- ప్రభుత్వం మారడంతో మార్పులుచేర్పులు
- పోస్టింగుల కోసం ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐల ప్రయత్నాలు
- అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 27 : సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, హుస్నాబాద్, సిద్దిపేట పోలీస్ డివిజన్లతోపాటు 6 సర్కిల్ కార్యాలయాలు, 4 ఎస్‌హెచ్‌వో స్టేషన్లు, 26 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఈ లెక్కన ముగ్గురు ఏసీపీలు, పది మంది సీఐలు, సుమారు 50 మంది ఎస్‌ఐలు లా అండ్ ఆర్డర్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

కీలక స్థానాలపై కన్ను

ప్రధానంగా సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ ఏసీపీలను బదిలీ చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. సీపీని బదిలీ చేసిన క్రమంలో తర్వాతస్థాయి అధికారులకూ స్థానచలనం తప్పదనే అభిప్రాయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ముగ్గురు కీలక అధికారులను బదిలీ చేస్తారనే ఊహాగానాలతో ఈ పోస్టింగుల కోసం పెద్దఎత్తున డీఎస్పీ స్థాయి అధికారులు పోటీపడుతున్నారు. గజ్వేల్, సిద్దిపేట డివిజన్‌కూ తీవ్ర పోటీ నెలకొన్నది. అదేవిధంగా సిద్దిపేట వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, రూరల్ సర్కిల్, గజ్వేల్ ఎస్‌హెచ్‌వో, గజ్వేల్ సర్కిల్, తొగుట, హుస్నాబాద్, చేర్యాల సర్కిల్ స్థానాల కోసమూ సీఐలు పోటీపడుతున్నారు. ఇక హుస్నాబాద్, తొగుట, చిన్నకోడూరు, కుకునూరుపల్లి, ములుగు, గౌరారం, రాజగోపాల్‌పేట, మర్కుక్, దుబ్బాక, కోహెడ, బెజ్జంకి, మిరుదొడ్డి, చేర్యాల, కొమురవెల్లి స్టేషన్లలో ఎస్‌ఐ పోస్టింగ్‌లు దక్కించుకోవడానికి పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు.

పోస్టింగుల కోసం పోటాపోటీగా

గత ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని, సాదాసీదా పోస్టింగులు, లూప్ లైన్ ఉద్యోగాలతో నెట్టుకొచ్చామని పలువురు అధికార కాంగ్రెస్ నేతల దృష్టికి తీసుకెళ్తున్నారు. తమకు మంచి పోస్టింగ్ ఇప్పిస్తే అనుకూలంగా ఉంటామని హామీలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని పోస్టుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, చేర్యాల ప్రాంతాల్లో ఆయా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు, ముఖ్య నేతలను కలుస్తున్నారు. ఏసీపీలను నియమించాలంటే డీజీపీకి, సీఐలకు పోస్టింగులు ఇవ్వాలంటే ఐజీకి, ఎస్‌ఐలను బదిలీ చేయాలంటే సీపీకి చెప్పాల్సి ఉండడంతో కాంగ్రెస్ ఇన్‌చార్జిలు కూడా తర్జనభర్జన పడుతున్నారు. జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికే తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అదేవిధంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న కొండా సురేఖతోపాటు స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నేతలతో సత్సంబంధాలున్న మరోమంత్రి దామోదర రాజనర్సింహ ద్వారా పోస్టింగుల కోసం నిమగ్నమయ్యారు.

పోలీసుల చిట్టాపై ఆరా

పోస్టింగులపై ఆరోపణలు తలెత్తకుండా పోలీసు ఉన్నతాధికారులు ముందస్తుగా జాగ్రత్త పడుతున్నట్లుగా తెలుస్తోంది. అవినీతి, అక్రమాల మరకలు అంటుకున్న వారిని మినహాయించి ఇతర ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లుగా చర్చ జరుగుతోంది. అధికార పార్టీ నేతల సూచనలతోపాటు ఇంటలిజెన్స్, ఎస్బీ విభాగాల నివేదిక ఆధారంగా జిల్లాలో పోస్టింగులు ఇవ్వనున్నారనే సమాచారం. ఇప్పటికే పోస్టింగుల కోసం పోలీస్ కమిషనర్‌ను పలువురు ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు కలుస్తున్నట్లు తెలిసింది. అయితే అధికారుల సర్వీస్ రికార్డు, ఇతర విషయాల ఆధారంగానే బదిలీల ప్రక్రియ ఉంటుందని సమాచారం. రెండురోజుల్లోనే పోలీసు బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు దశలవారీగా వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే మళ్లీ బదిలీల ప్రక్రియ నిలిచిపోతుంది. అందుకే త్వరపడుతున్నట్లు తెలుస్తోంది.

పలువురు సీఐల బదిలీ

సిద్దిపేట క్రైం, జనవరి 27 : సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు సీఐలు శనివారం బదిలీ అయ్యారు. సిద్దిపేట టూటౌన్ పోలీసుస్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. సిద్దిపేట త్రీ టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న భానుప్రకాష్ ఖమ్మంకు బదిలీ అయ్యారు. ఎస్‌బీ విభాగంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.సురేందర్‌ను ధార్‌పల్లి సర్కిల్‌కు, టాస్క్‌ఫోర్స్ సీఐగా విధులు నిర్వహిస్తున్న జగడం నరేష్‌ను బిచ్‌కుంద సర్కిల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు హైదరాబాద్ మల్టీజోన్ టూ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌ల పదవీకాలం పొడగింపు కష్టం

- సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు
- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



పాములపర్తిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ తదితరులు

జగదేవ్‌పూర్, జనవరి 27 : పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌ల పదవీకాలం పొడగింపు కష్టమని రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పష్టం చేశారు. శనివారం మండలంలోని పాములపర్తి గ్రామంలో సర్పంచ్ తిరుమలరెడ్డితో కలిసి పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12 వేల గ్రామ పంచాయతీలుండగా, వాటి అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సహకారం లేకున్నా గ్రామాలాభివృద్ధికి సర్పంచ్‌లు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన ద్వారా కోటీ ఐదు లక్షల దరఖాస్తులు రాగా, వాటి పరిష్కారానికి దృష్టిపెట్టినట్లు తెలిపారు. కాగా ఇప్పటికే రెండు పథకాలను అమలు చేస్తుండగా, వంద రోజుల్లోనే ఇచ్చిన హామీల అమలుకు సర్కార్ కట్టుబడి ఉందన్నారు. ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పాములపర్తి గ్రామాభివృద్ధి కోసం రూ.30లక్షలను మంజూరు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, ఆర్డీవో బన్సీలాల్, ఏపీడీ కౌసల్యదేవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షారెడ్డి, మాజీ ఎంపీపీలు రంగారెడ్డి, మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కనకయ్య, నాయకులు యాదగిరి, ప్రభుదాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తి నల్లాలే!

- మల్లన్న భక్తులకు మిషన్ భగీరథ నీళ్లు కరువు
- జాతరవారంలో సరఫరా కాకపోవడంతో బోనం తయారీలో ఇబ్బందులు
- దాహార్తి తీర్చుకోవడానికి నానాతంటాలు
- దేవాదాయ శాఖ మంత్రి, కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

చేర్యాల, జనవరి 27 : కొమురవెల్లి మల్లన్న భక్తులకు మిషన్ భగీరథ ద్వారా సురక్షిత తాగునీటి అందిస్తామని స్వామివారి కల్యాణానికి ముందు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయవర్గాలు గొప్పలు చెప్పినా ఆచరణలో మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. చాన్నాళ్ల క్రితం ఆలయ పరిసరాలలోని తోటబావి ప్రాంగణం, బతుకమ్మ చెరువు, తదితర చోట మిషన్ భగీరథ నల్లాలను ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో ఏమాత్రం అందుబాటులోకి తీసుకురాకపోగా, కనీసం మల్లన్న జాతరవారం సమయంలోనైనా నీటి సరఫరా చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కొమురవెల్లికి శనివారం సాయంత్రం విచ్చేసిన భక్తులు ఆదివారం లేదా సోమవారం తిరుగు ప్రయాణమవుతారు. రెండు రోజులపాటు బసచేసి మల్లన్నకు విధిగా బోనం నివేదిస్తారు. అందుకు తాగునీరు ఎంతో అవసరం ఉన్నప్పటికీ నీటివసతి కల్పించకపోవడంతో సమీపంలోని వ్యవసాయబావుల దగ్గర నుంచి లేదా దుకాణాల్లో కొని తెచ్చుకుంటున్నారు. అంతేకాకుండా ఇంటిల్లిపాది దాహార్తి తీర్చుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. సంబంధిత అధికారులు తమకేమీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించినప్పటికీ ఉత్తుత్తి నల్లాలుగా మార్చేయడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కానరాని పారిశుధ్య చర్యలు

జాతర వేళ భక్తులు అధికంగా బసచేసే ఆలయ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు సక్రమంగా నిర్వహించకపోవడంతో కంపుకొడుతున్నాయి. ప్రైవేటు గదుల్లోని డ్రైనేజీ నీరు ఆరుబయట ప్రవహిస్తున్నా, పలు ప్రదేశాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నా పట్టించుకోవడం లేదు. భక్తులకు నిరంతరం తాగునీరు వసతి కల్పించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ చేసిన ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు.





బతుకమ్మ చెరువు మార్గంలో వృథాగా భగీరథ నల్లాలు, తోటబావి ప్రాంగణంలోని నల్లాల వద్ద రాని నీరు



మాట్లాడుతున్న హరీశ్‌రావు

హామీలు నెరవేర్చే వరకు కాంగ్రెస్ వెంటపడతాం

- అబద్ధపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చారు
- గెలుపోటములు మాకు కొత్తేమీ కాదు
- తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ పార్టీయే
- సిద్దిపేట నియోజకవర్గ కృతజ్ఞత సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 27 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని కొండా భూదేవి గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడుతూ నవంబరులో జరిగిన ఎన్నికల్లో ప్రతీ నాయకుడు, కార్యకర్త తానోక హరీశ్‌రావుగా భావిస్తూ తనకు 80 వేలకుపైగా మెజార్టీ అందించారని, ప్రతీ ఒక్కరికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం రాలేదని పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దని, గెలుపోటములు పార్టీకి కొత్తేమి కాదన్నారు. 2009లో కేవలం 10 సీట్లు మాత్రమే గెలిచామని, ఆనాడు బాధపడకుండా ముందడుగు వేసి పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు వివరించారు. ఉద్యమంలో ముళ్లబాట, స్వరాష్ట్రంలో పూలబాట చూశామన్నారు. గత ఎన్నికల్లో కేవలం 1.8 శాతం అంటే 4 లక్షల ఓట్లతో అధికారం కోల్పోయమని హరీశ్‌రావు తెలిపారు. అందులో దళిత, బీసీ బంధు కూడా కొంత కారణమైందన్నారు. దీంతో పాటు ప్రతీ ఒక్కరిచేతిలో మొబైల్ ఫోన్ ఉండటంతో సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు కూడా సగం మన కొంప ముంచినాయన్నారు. బీఆర్ఎస్ పథకాలతో దక్షిణ భారతదేశంలో మూడోసారి అధికారం కైవసం చేసుకున్న పార్టీగా నిలుస్తామనుకున్నామని తెలిపారు. గడపగడపకు బీఆర్ఎస్ పథకాలు చేరాయని ప్రచారం చేయడంలో వెనకబడిపోయామని తెలిపారు.

పదవిలో లేకున్నా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకొంటూ ఫోజులిచ్చారు

కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవి లేకున్నా సరే ప్రజాపాలన దరఖాస్తులు తీసుకొంటూ ఫోజులిచ్చారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో అమలు కానీ హామీలిచ్చి, అబద్ధాల ప్రచారంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులకు నవంబరులోనే రైతుబంధు ఇస్తామంటే ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15వేలు, నిరుద్యోగ భృతి రూ.4వేలు, ఆసరా కింద రూ.4వేలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, 18 ఏళ్లు దాటిన మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మికి తులం బంగారం ఏమయ్యాయని ప్రశ్నించారు. గతంలో సీఎం రేవంత్, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారంలోకి రాగానే మాట మార్చిన విధానంపై వీడియో ప్రజెంటేషన్ ద్వారా కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, నాయకులు జంగిటి కనకరాజు, పాల సాయిరాం, రాజనర్సు, మారెడ్డి రవీందర్‌రెడ్డి, రాధాకిషన్‌శర్మ, కొండం సంపత్‌రెడ్డి, మోహన్‌లాల్, మేర సత్తన్న, పిండి అరవింద్‌యాదవ్, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వంగ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

అధికారంలో ఉన్నవాళ్లకు ఓపిక ఉండాలి

అధికారంలో ఉన్నవాళ్లకు ఓపిక ఉండాలని, హామీల అమలుపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు ఉద్యమాలు చేయడం, దాడులు, బెదిరింపులకు గురికావడం కొత్త కాదని చెప్పారు. ఇచ్చిన హామీలను ఎలా ఎగ్గొట్టాలో కాంగ్రెస్ ఆలోచిస్తోందని, అందుకే అప్పులని, లంకె బిందెలని సాకులు చెబుతున్నారన్నారు. ఫిబ్రవరి రెండో వారంలో నోటిఫికేషన్ వస్తుందని అంటున్నారని, కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోపు హామీలను అమలు చేసేలా జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. మీరు అమలు చేస్తే ప్రతిపక్ష హోదాలో తామే అభినందిస్తామని తెలిపారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరా నీరు పారడం లేదన్నారని, మరి మొన్న మంత్రి కొండా సురేఖ రంగనాయకసాగర్ నీరు విడుదల చేసి 1.10 లక్షల ఎకరాలకు నీరు విడదల చేసినట్లు ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. ఇలా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ద్వారా నీరు పారడం లేదా అని ప్రశ్నించారు. రైతులకు 24 గంటలు త్రీ ఫేజ్ అమలు కావడం లేదని, కేవలం 14 నుంచి 16 గంటలకు మించి రావడం లేదన్నారు. దాంతో పాటుగా మళ్లీ ఎరువుల కొరత కూడా ప్రారంభమైందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది కాంగ్రెస్, బిజెపిలు కావని, కేవలం బిఆర్ఎస్‌తో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చురకనంటిద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఎంపీలను గెలిపిస్తేనే నిలదీయగలుగుతామన్నారు.

విజయ డెయిరీ పాల కేంద్రంలో చేతివాటం !

మద్దూరు, జనవరి 27 : మండలంలోని లద్నూరు విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల కేంద్రంలో చైర్మన్ చేతివాటం ప్రదర్శించారు. కమిటీ సభ్యులు నిర్వహించిన ఆడిట్‌లో రూ.4 లక్షలు వాడుకున్నట్లు తేలింది. శనివారం సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్యతో పాటు కమిటీసభ్యులతో కలిసి కార్యదర్శి కూరెల్ల బుచ్చిరాములు ఏర్పాటు చేసిన సంఘం లావాదేవీల సమావేశంలో చైర్మన్ ఇదాయత్ తుల్లా సిద్దిఖ్ చేతివాటం బయటపడింది. ఈ మేరకు కార్యదర్శితో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, సభ్యులు వివరాలు వెల్లడించారు. పాల ఉత్పత్తిదారుల కేంద్రంలో చైర్మన్‌గా కొనసాగిన ఇదాయత్ తుల్లా సిద్దిఖ్ సంఘం లావాదేవీలకు 2019 నుంచి నేటి వరకు ఆడిట్ నిర్వహించలేదు. గతంలో సంఘంలో నిల్వ ఉన్న డబ్బుల నుంచి బ్యాంకులో రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశానని చెప్పి ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ పేపరు ఇవ్వలేదు. దీంతో పాటు నిర్వహించిన లావాదేవీలలో రూ.3 లక్షలు వాడుకున్నట్లు తేలడంతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూ.లక్షతో కలిపి రూ.4 లక్షలు తేలింది. దీంతో డబ్బు చెల్లించాలని సభ్యులు పట్టుపట్టారు. ప్రస్తుతం తన వద్ద డబ్బు లేదని రెండు నెలల్లో చెల్లిస్తానని చెప్పి చైర్మన్ బాండ్ పేపరు రాసి ఇచ్చాడని తెలిపారు. చైర్మన్ పదవీ కాలం పూర్తయినందున సభ్యుల సూచన మేరకు నూతన కమిటీని త్వరలో ఎన్నుకోనున్నట్లు కార్యదర్శి బుచ్చిరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లద్నూరులో సంఘం లావాదేవీలపై ఆడిట్ నిర్వహిస్తున్న సభ్యులు

ఎరువుల లెక్క.. ఇక పక్కా

- అందుబాటులోకి 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం'
- ఎరువుల దుకాణాల్లో నిల్వల వివరాల నమోదుకు యాప్

మెదక్, జనవరి 27: ఎరువుల నిల్వల లెక్కలు ఇకపై పక్కాగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వం వద్ద ఎరువుల నిల్వల లెక్క పక్కాగా లేకపోవడంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. రికార్డుల్లో ఉన్న వివరాలకు.. గోడౌన్లలో ఉన్న నిల్వలకూ వ్యత్యాసం ఉంటున్నట్లు వ్యవసాయ అధికారుల తనిఖీల్లో తరచుగా బయటపడుతున్నది. దీంతో వ్యవసాయశాఖ నూతన సాంకేతికత ఆధారంగా పక్కా వ్యవస్థను రూపొందించింది. ఎరువుల నిల్వల్లో తేడాలు ఉండకుండా వివరాలను నమోదు చేయడానికి 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం యాప్'ను అమల్లోకి తెచ్చింది. ఎరువుల లెక్కలు తేల్చడానికి ఈ యాప్ అధికారులకు ప్రయోజనకారిగా మారింది.



యాప్

రసాయన ఎరువులే ఎక్కువ

రైతులు పంటసాగుకు రసాయన ఎరువులనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రధానంగా మెదక్ జిల్లాలో వరి సాగుకు డీఏపీ, యూరియాను విరివిగా వినియోగిస్తారు. 24,012 మెట్రిక్ టన్నుల యూరియా, 3,205 మెట్రిక్ టన్నుల డీఏపీ యాసంగి పంటల సాగుకు వినియోగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ తమ యాక్షన్ ప్లాన్‌లో పేర్కొంది. గత సీజన్లకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తే.. సగటున రైతులు అక్టోబరులో 600 మెట్రిక్ టన్నులు, నవంబరులో 512 మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 3,740 మెట్రిక్ టన్నులు, జనవరిలో 5,560 మెట్రిక్ టన్నులు, ఫిబ్రవరిలో 9,500 మెట్రిక్ టన్నులు, మార్చిలో 4,100 మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగిస్తున్నారు. అదే విధంగా డీఏపీ వినియోగాన్ని పరిశీలిస్తే అక్టోబరులో 130 మెట్రిక్ టన్నులు, నవంబరులో 180 మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 1,400 మెట్రిక్ టన్నులు, జనవరిలో 1,021 మెట్రిక్ టన్నులు, ఫిబ్రవరిలో 224 మెట్రిక్ టన్నులు, మార్చిలో 250 మెట్రిక్ టన్నులు వాడుతున్నారు. ఏ నెలలో ఎంత ఎరువులు అందుబాటులో ఉంచాలనే లెక్కలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. దీని ఆధారంగానే అధికారులు ఎరువులు సరఫరా చేస్తారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి(ఫైల్)

దుకాణాల్లో తనిఖీలు

జిల్లాలో మండల వ్యవసాయాధికారులు 15 రోజుల నుంచే కొత్త యాప్‌ను అమలులోకి తీసుకువచ్చారు. ఈమేరకు అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి సేల్ పాయింట్ల వద్ద ఎరువు నిల్వల వివరాలు, ఫొటోలను ప్రతీ సోమ, గురువారాల్లో యాప్‌లో నిక్షిప్త పరుస్తారు. స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టే ఫొటోలను మూడురోజుల వ్యవధిలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఎరువుల దుకాణాల్లో పీవోఎస్ యంత్రాలు ఉపయోగిస్తున్నారా, లేదో వివరాలు సేకరించాల్సి ఉంటుంది. డివిజన్‌స్థాయి సంచాలకులు వారానికి రెండురోజుల పాటు ఐదు దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేయాలి. జిల్లాస్థాయిలో డీఏవో వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎరువుల కంట్రోల్ ఆర్డర్ ప్రకారం దుకాణాల నిర్వహణ పక్కాగా తెలుసుకోవచ్చు. యాప్‌లో జిల్లాస్థాయిలో కలెక్టర్, డీపీవోకు మాత్రమే లాగిన్ వెసులుబాటు కల్పించడంతో పర్యవేక్షణ పకడ్బందీగా ఉండనుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

సిద్దిపేట క్రైం, జనవరి 27 : జిల్లాలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మూడు దశల్లో ఇంటర్ ప్రయోగ పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జనరల్, ఒకేషనల్ కలిపి 63 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సైన్స్ ప్రయోగంలో మొత్తం 2,242 మంది, ఒకేషనల్ కోర్సులో ప్రథమ సంవత్సరంలో 8,476 మంది, ద్వితీయ సంవత్సరంలో 7,411 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. అదేవిధంగా ఫిబ్రవరి 16 తేదీన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు మొదటిసారిగా ఆంగ్లంలో ప్రయోగ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 17వ తేదీన గత సంవత్సరం రాయనివారికి, ఫెయిల్ అయిన వారికి ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష ఉదయం పది గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 19న ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఎన్విరాన్‌మెంట్ పరీక్ష ఆయా కళాశాలల్లోనే నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఇంటర్ ప్రయోగ పరీక్షలకుగాను హైపవర్ కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, సభ్యులుగా ఎస్పీ, ఆర్జెడీ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, జిల్లా డీఐఈవో ఉంటారని పేర్కొన్నారు. వీరు కాకుండా డీఈసీ సభ్యులు, ప్రయోగ పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తారని తెలిపారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా, ఒత్తిడి లేకుండా ప్రయోగ పరీక్షలకు హాజరు కావాలని కోరారు. ఫీజుబకాయిల పేరుతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యా వైజ్ఞానిక సదస్సులను విజయవంతం చేయండి

● టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సంగయ్య

పాపన్నపేట, జనవరి 27: విద్యా వైజ్ఞానిక సభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సంగయ్య పేర్కొన్నారు. శనివారం పాపన్నపేటలో ఆ సభల పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఫిబ్రవరి 4న మెదక్‌లోని ద్వారకా గార్డెన్‌లో నిర్వహించే విద్యా సదస్సును, ఫిబ్రవరి 11, 12న నిర్వహించే విద్యా వైజ్ఞానిక మహాసభలకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ కోదండరాం హాజరవుతారన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డితోపాటు పలువురు వక్తలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయ దర్శిని, ఎడిటర్ శశిధర్, రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు హీరాలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాల్‌రాజ్, రమేష్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ కార్యవర్గానికి నోటిఫికేషన్ జారీ

మనూరు, జనవరి 27: సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచ నల్ల పోచమ్మ దేవాలయం కార్యవర్గ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయినట్లు దేవాదాయశాఖ అధికారి మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చే నెల మొదటి వారంలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.



వరికోలు గ్రామంలో వరి పంట పరిశీలిస్తున్న ఏఈవో

వరి పంటను పరిశీలించిన ఏఈవో

కోహెడ, జనవరి 27: మండలంలోని వరికోలు గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ వరి పంటను శనివారం క్షేత్ర పరిశీలన చేశారు. వరిలో కాండం తొలుచు పురుగు, జింక్ లోప లక్షణాలను గమనించినట్లు తెలిపారు. 20 నుంచి 25 రోజుల పిలక దశలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఉన్నందున దాని నివారణకు 3జి కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున లేదా కర్టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 8కిలోల చొప్పున పొలంలో పలుచగా నీరు ఉంచి చల్లాలని ఆయన వివరించారు. అలాగే జింక్ లోపం ఉన్న వరి పొలంలో ఆకుల చివర్లో మధ్య ఈనేకు ఇరువైపుల తుప్పు లేదా ముదురు ఇటుక రంగు చిన్న మచ్చలు ఏర్పడతాయని, దాని నివారణకు జింక్ సల్ఫేట్ 2గ్రా/లీటరు నీటికి, 7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసినట్లయితే జింక్ లోపాన్ని నివారించవచ్చని వివరించారు.

మున్సిపల్‌లో అవినీతిపై ఫిర్యాదు

దుబ్బాక, జనవరి 27: దుబ్బాక మున్సిపాలిటీలోని 3వ వార్డుకు నిధులు కేటాయించకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, కమిషనర్ అవినీతికి పాల్పడడం జరిగిందంటూ శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌తోపాటు సీఎంఎం కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు దుబ్బాక మున్సిపల్ 3వవార్డు బీజేపీ కౌన్సిలర్ మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన నిధులను తన వార్డుకు కేటాయించకపోవడలో పూర్తిగా వివక్షను చూపారని ఆరోపించారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాయంలో చైర్మన్‌తో పాటు కమిషనర్ అక్రమంగా నిధులకు డ్రాచేసి అవినీతి పాల్పడ్డారని ఆరోపించారు.

క్రీడలతో ఉద్యోగులకు మానసికోల్లాసం

● సిద్దిపేటలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 27: బ్యాంకుల్లో విధులు నిర్వహిస్తూ నిత్యం ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు క్రీడా పోటీలు ఆడడం ద్వారా మానసిక ప్రశాంతత వస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో డీసీసీబీ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల మధ్య క్రికెట్ పోటీలను హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట స్టేడియానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన అతిథులకు, క్రీడా పోటీలు ఆడేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. మహిళా ఉద్యోగులను కూడా క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్, నాయకులు పాల సాయిరాం, మేర సత్తన్న తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలోని క్రికెట్ స్టేడియంలో బ్యాటింగ్ చేస్తూ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

సామాజిక భవనాలకు సిద్దిపేట ఆదర్శం

సమాజ శ్రేయస్సు, సామాజిక భవనాలకు సిద్దిపేట ఆదర్శమని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని కాల్లకుంట కాలనీలో పద్మశాలీ సంఘ భవనాన్ని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జంగిటి కనకరాజు, రాజనర్సు, పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చెక్కుల అందజేత

బూరుగుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అంబటి గణేశ్, పట్టణంలోని 17వ వార్డుకు చెందిన కార్యకర్త మిరుదొడ్డి వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. గణేశ్ భార్య అంబటి రవళికి, వెంకటేష్ భార్య మిరుదొడ్డి లలితకు రూ. 2 లక్షల చొప్పున బీఆర్ఎస్ పార్టీ తరపున ఇన్సూరెన్స్ చెక్కులను హరీశ్‌రావు శనివారం అందజేశారు.

క్రీడల్లో రాణించిన విద్యార్థులకు అభినందన

సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన 37వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేట తైక్వాండో అసోసియేషన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 8 పతకాలు సాధించారు. దీంతో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జిల్లా తైక్వాండో కార్యదర్శి మాస్టర్ రాసకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ డే జెండా ఆవిష్కరణ

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేటలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎలక్ట్రీషియన్ డే కార్యక్రమంలో మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొని జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ వారికీ స్థలాన్ని, భవనానికి నిధులు ఇచ్చామని, భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తానన్నారు. ఎలక్ట్రీషియన్స్ పనిలో జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాల నివారణకు అవసరం అయితే రిటైర్డ్ ఇంజనీర్ లతో శిక్షణ ఏర్పాటు చేయిస్తానన్నారు. ఎలక్ట్రీషియన్స్‌కు ప్రమాద బీమా ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నో అడ్మిట్ నుంచి నో అడ్మిషన్ స్థాయికి ఎదిగిన ఇందిరానగర్ పాఠశాల

సిద్దిపేట టౌన్, జనవరి 27: నో అడ్మిట్ నుంచి నో అడ్మిషన్ స్థాయికి ఇందిరానగర్ పాఠశాల ఎదిగిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్, డిజిటల్ కంటెంట్ పుస్తకాలు, బాసర ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఐ ప్యాడ్లను హరీశ్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తన జీతం డబ్బుల నుంచి ఇంట్లో పిల్లల డిజిటల్ స్టడీ కోసం సాయంత్రం వేళ స్నాక్స్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

కోహెడలో గుడిసె దగ్ధం.. రూ.లక్ష ఆస్తి నష్టం



దగ్ధమైన గుడిసెను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేఖ, పోలీసులు

కోహెడ జనవరి 27: మండల కేంద్రంలోని బాడుగల చెరువు సమీపంలో శనివారం ప్రమాదవశాత్తు నివాస గుడిసె దగ్ధమై సుమారు రూ. లక్ష వరకు నష్టం సంభవించింది. బాధితుడు వేల్పుల చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రయ్య నివాసముండే గుడిసెకు పక్కనే ఉన్న గడ్డివాము అంటుకుని చెలరేగిన మంటలు నివాసగుడిసెకు వ్యాపించాయి. దీంతో గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో పెద్ద శబ్దానికి గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. మంటలు ఎగిసిపడడంతో దానిని ఆర్పేందుకు చుట్టుపక్కల ప్రజలు తరలి వెళ్లారు. ఆ సమయంలో చంద్రయ్య అతడి భార్య కూడా లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. గుడిసెలో వ్యవసాయ పనిముట్లు, తిండి గింజలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. తహసీల్దార్ సురేఖ, హెచ్‌సీ కనుకయ్య బ్లూకోటు పోలీసులు సంఘటన వద్ద పంచనామా నిర్వహించారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిన న్యాయవాదులు



బీజేపీలో చేరిన న్యాయవాదులతో ఎంపీ బండి సంజయ్

హుస్నాబాద్, జనవరి 27: ఎంపీ బండి సంజయ్ సమక్షంలో శనివారం కరీంనగర్‌లో హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టుకు చెందిన న్యాయవాదులు బీజేపీలో చేరారు. న్యాయవాదులు పిట్టల దేవదాసు, విలాసాగరం మురళీమోహన్, బాలరాజు, మాధవిలకు ఎంపీ బండి సంజయ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సాయిని మల్లేశం, బీజేపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి దేవేందర్, న్యాయవాదులు అజయ్‌కుమార్, ఉప్పరపల్లి సంపత్, శ్రీదేవి తదితరులున్నారు.

పంచతంత్ర పాఠశాలలో ఉచిత దంత వైద్యశిబిరం

చేర్యాల, జనవరి 27 : చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో శనివారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంతవైద్యుడు ప్రణీత్‌యాదవ్ పాఠశాల విద్యార్థులందరికీ దంత పరీక్షలు జరిపి దంత రక్షణ పట్ల పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ఈకేవైసీ చేసుకోవాలి

చేర్యాల, జనవరి 27 : రేషన్‌సరుకులు సక్రమంగా పొందేందుకు ప్రతీ వినియోగదారుడు విధిగా ఈ నెల 31వ తేదీలోగా రేషన్ దుకాణాలలో ఆధార్ ఈ-కేవైసీ చేసుకోవాలని చేర్యాల మండల రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధి ఊట్లపల్లి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏఐసీసీ కార్యదర్శిని కలిసిన రామగల్ల పరమేశ్వర్

చేర్యాల, జనవరి 27 : చేర్యాల మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నేత రామగల్ల పరమేశ్వర్ శనివారం ఏఐసీసీ కార్యదర్శి, వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి రోహిత్ చౌదరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాదు గాంధీభవన్‌లో ఆయనను కలిసి వరంగల్ పార్లమెంట్ స్థానం టికెట్ తనకు ఇప్పించాలని అభ్యర్థించారు.

శ్రీచైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

చేర్యాల, జనవరి 27 : విద్యాబోధనకు బదులు విద్యార్థుల్లో మతభావజాలాన్ని ప్రేరేపిస్తున్న చేర్యాల శ్రీచైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ స్కూల్ యాజమాన్యం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మతతత్వ భావాలను బోధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ఫ్యాకల్టీ, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దర్శనం రమేశ్, రాకేశ్ పాల్గొన్నారు.


నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



అల్వాల గురుకులంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి, జనవరి 27: మిరుదొడ్డి మండలం అల్వాల్ చౌరస్తాలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈ రాష్ట్ర కార్యదర్శి నూనె దయాకర్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటరమణ, కృష్ణమూర్తి, గణేష్ ఉన్నారు.

హుస్నాబాద్ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక



నియోజకవర్గ జేఏసీ నూతన కార్యవర్గం

హుస్నాబాద్, జనవరి 27: హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ (జాక్) నూతన కార్యవర్గాన్ని శనివారం పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గంలోని తెలంగాణ ఉద్యమకారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు సమావేశమై జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా కవ్వ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్లుగా మేకల వీరన్నయాదవ్, ద్యాగల సారయ్య, కో కన్వీనర్లుగా కొయ్యడ కొంరయ్య, ముక్కెర సంపత్‌కుమార్, చింతకింది శ్రీనివాస్, మండల జంపన్న, తూమోజు జగదీశ్వరచారి, షేక్ హుస్సేన్, చీకోటి రమణయ్య, పన్యాల రవీందర్ రెడ్డి, ఉప్పుల కుమారస్వామి, చెప్యాల ప్రకాష్, ఎదులాపురం తిరుపతి, మోహన్ నాయక్, బత్తుల బాబు, పన్యాల భూపతిరెడ్డి, దండబోయిన కొమురెల్లి, సింగిరాల కనుకయ్య, కార్యవర్గ సభ్యులుగా ప్రొఫెసర్ వీరన్న నాయక్, కూరపాటి నాగరాజు, పోలోజు రాజ్‌కుమార్, చందుల వీర సోమయ్య, వడ్డెపల్లి మల్లేశం, సుద్దాల ఎల్లయ్య, గంపల శ్రీనివాస్, కొండమీది శ్రీనివాస్ వినీత్, తొందూరి ఎల్లయ్య, వెంకటరమణారెడ్డి, పొన్నాల ఫ్రాన్సిస్, ఉల్లి కుమారస్వామి, గంప సంపత్‌కుమార్, గంప చంద్రశేఖర్, ఆర్టీసీ మహేందర్, పచ్చిమట్ల శ్రీనివాస్, కోడం ప్రభాకర్, పొడిశెట్టి కుమారస్వామిని ఎన్నుకున్నారు.

గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదు - జేఏసీ కన్వీనర్ లక్ష్మారెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేదని ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు, వెనుకబడిన జాతులకు సరైన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే స్వాతంత్ర్యం వచ్చాక ఇంత వరకు లేని మంత్రి పదవి ఇటీవల పొన్నం ప్రభాకర్ రూపంలో రావడం అందరికీ ఆనందకరమని, తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం హర్షనీయమన్నారు. త్వరలోనే వీరిద్దరికి ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు.

వాడీవేడిగా మిట్టపల్లి గ్రామసభ

పలు అంశాలపై తీర్మానం



మిట్టపల్లి గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

సిద్దిపేట అర్బన్, జనవరి 28: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో సర్పంచు వంగ లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొన్ని రోజులుగా వస్తున్న అనేక అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది. అనంతరం గ్రామపాలకవర్గం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. అందులో ప్రధానంగా గ్రామాన్ని సుడాలో విలీనం చేయకూడదని, గ్రామపరిధిలోని ఆర్చ్ ఫార్మా కంపెనీని తొలగించి రైతులకు న్యాయం చేయాలని, గ్రామపరిధిలో మట్టి అక్రమ తవ్వకాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, 59జీవోలో అవకతవకలు నెలకొన్నాయని, వాటిని పరిశీలించి విచారణ జరపాలని కోరారు. బాలవికాస కేంద్రానికి సంబంధించిన తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజకుమార్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నివర్గాల అభివృద్ధి



నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కొత్తూరు గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు

ములుగు, జనవరి 27: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలు ప్రజల అభివృద్ధి చెందుతారని జిల్లా డీసీసీ అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం ములుగు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు గజ్వేల్‌లో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో నిజమైన పేదలకు న్యాయం జరగలేదని, అందరికీ న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరిని ప్రభుత్వ పథకాలు అందించే విధంగా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా నాయకుడు భూరం గణేశ్ యాదవ్, ఎర్ర వీరేష్, మహేందర్, సతీష్, యాదగిరి, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

గజ్వేల్ రూరల్, జనవరి 27. గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామంలో ఈ నెల 26 చైన్ స్నాచింగ్ సంఘటనలో మరణించిన శ్యామల కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ డీసీసీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడం బాధాకరమన్నారు. అన్ని విధాలుగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, నిందితుడికి చట్ట ప్రకారం శిక్షపడేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యదగిరి, నాయకులు మల్లారెడ్డి, సరుష్, చంద్రారెడ్డి, సత్యం,వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



సదానందాశ్రమంలో భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తున్న మాధవానంద సరస్వతి

మిరుదొడ్డి, జనవరి 28: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగిఉండాలని రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి ఉద్బోధించారు. శనివారం మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్ సదానందాశ్రమంలో భగద్గీత పారాయణంపై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని, దీనివల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. ధర్మాన్ని మనం కాపాడితే న్యాయం మనల్ని రక్షిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు రాజవున్నయ్యశర్మ, జయరాంశర్మ, సదానంద ఆశ్రమ సభ్యులు తదితరులున్నారు.



దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖకు మల్లన్న ప్రసాదాన్ని అందజేస్తున్న పునరుద్ధరణ కమిటీ సభ్యులు

దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖను కలిసిన పునరుద్ధరణ కమిటీ సభ్యులు

చేర్యాల, జనవరి 27 : కొమురవెల్లి మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు శనివారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కమిటీ నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో 120గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. అనంతరం మంత్రి కొండా సురేఖ జాతర నిర్వహణపై పలు సూచనలు చేశారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ ప్రదేశాల నుంచి ఆలయం వరకు ఎలక్ట్రిక్ ఆటోలు ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న వేసవి దృష్ట్యా భక్తులు ఎండకు ఇబ్బందులు పడకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయాలని సూచించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఆకునూరు విద్యార్థి



అనూషను సత్కరిస్తున్న జడ్పీఎస్ఎస్ ఎస్ఎంసీ చైర్మన్

చేర్యాల, జనవరి 27: మండలంలోని ఆకునూరు జడ్పీఎస్ఎస్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి పి. వైష్ణవి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వరకు జైపూర్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ జట్టు తరఫున పాల్గొననున్నది. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైష్ణవి, ఆమె తల్లిని పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ కోతిదాసు అభినందించి శాలువా కప్పి సత్కరించారు.

సైన్స్‌ఫెయిర్‌లో జాతీయ స్థాయికి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్, జనవరి 27: రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫెయిర్)లో 2023 సిద్దిపేట జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మర్కూక్ మండలంలోని దామరకుంట ఉన్నతపాఠశాల విద్యార్థిని సుష్మ పాల్గొని 'సాలుకు ఇరువైపుల సులభంగా ఎరువు వేసే పరికరం రైతు నేస్తం' అత్యుత్తమ ప్రదర్శన, వారి గైడ్ టీచర్ చిన్న బ్రహ్మయ్య స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రదర్శన చేసి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయుల బృందం, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రావు, నర్సింహులు, శ్రీనివాస్‌చారి, రమణరావు, శంకర్‌రెడ్డి తదితరులు విద్యార్థినితో పాటు గైడ్ టీచర్‌ను అభినందించారు.

లబ్ధిదారులకు పాడి గేదెల పంపిణీ



పాడి గేదెలను లబ్ధిదారులకు అందజేసిన సర్పంచ్

మద్దూరు, జనవరి 27: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితుల ఆర్థికాభివృద్ధికి సబ్సిడీపై అందించిన పాడిగేదెలతో లబ్ధిదారులు జీవనోపాధి పొందాలని సర్పంచ్ చొప్పరి వరలక్ష్మిసాగర్ సూచించారు. శనివారం దూళిమిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన 11 మందికి ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంజూరైన పాడిగేదెలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షలు కాగా లబ్ధిదారుడికి రూ.1.40లక్షల సబ్సిడీ చొప్పున 11 మంది దళితులకు పాడిగేదెలు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్,చైర్మన్, జిల్లా ఏడీకి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలి

చేర్యాల, జనవరి 27: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ పట్టభద్రుడు ఓటరు నమోదు చేసుకోవాలని చేర్యాల మున్సిపల్ కౌన్సిలర్ చెవిటి లింగం, కాంగ్రెస్ పార్టీ చేర్యాల పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఓటుహక్కు కలిగిఉన్నా ప్రస్తుతం విధిగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పట్టభద్రులు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో సర్పంచు చెరుకు రమణారెడ్డి, నాయకులు కొయ్యడ శ్రీనివాస్, ఎలుగల మల్లేశం, ఊట్లపల్లి శ్రీనివాస్, దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పట్టిన క్రీడాప్రాంగణాల ఆటవస్తువులు.. ఎమ్మెల్యే జోక్యంతో యువతకు పంపిణీ

మిరుదొడ్డి, జనవరి 27: ఆరు నెలల క్రితం గత ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాల కోసం ఇచ్చిన ఆటవస్తువులను గ్రామంలోని యువత కోరినా కార్యదర్శి పంపిణీ చేయకపోవడంతో పక్కదారి పట్టాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయాన్ని శుక్రవారం పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో శనివారం కొన్ని ఆట వస్తువులను పంపిణీ చేశారు. అక్బర్‌పేట- భూంపల్లి మండలం రుద్రారంలో ఈ ఉదంతం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. రుద్రారం గ్రామంలో క్రీడాప్రాంగణం కోసం క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ ఆటవస్తువులను ప్రభుత్వం పంపిణీ చేసింది. గ్రామానికి వచ్చిన ఆటవస్తువులు యువతకు పంపిణీ చేయాల్సిన గ్రామకార్యదర్శి. వాటిని పక్కదారి పట్టించారు. గ్రామసచివాలయంలో నుంచి ఆటవస్తువులను మాయం చేశారు. కొందరు యువకులు ప్రాక్టీస్ కోసం ఆటవస్తువులు ఇవ్వాల్సిందిగా గ్రామకార్యదర్శిని అడిగినా ఫలితం లేకపోయింది. ఇటీవల మెదక్‌లో జరిగిన జీపీఎల్ సెలక్షన్‌లో గ్రామయువత ఎంపికయ్యారు. తాము ప్రాక్టీస్ చేసుకోవడానికి క్రికెట్ కిట్లు ఇవ్వాల్సిందిగా కార్యదర్శిని అడిగారు. అయినా స్పందించకపోవడంతో శుక్రవారం యువత కార్యదర్శిని నిలదీశారు. కార్యదర్శి నిర్లక్ష్యవైఖరిపై గ్రామస్థులు వెంటనే దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మిరుదొడ్డి ఎంపీడీవో రాజిరెడ్డిని ఆదేశించారు. విచారణ జరిపిన ఎంపీడీఓ వెంటనే ఆటవస్తువులను పంపిణీ చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో పక్కదారి పట్టిన ఆటవస్తువుల్లో కొన్నింటిని శనివారం గ్రామ సచివాలయానికి తెచ్చిన కార్యదర్శి, అండర్14 విద్యార్థులు ఆడుకునే బ్యాట్లను మాత్రమే అందించారు. మిగితా ఆటవస్తువులు, జర్సీ టీషర్టులు సోమవారంలోగా వారికి అందించాలని గ్రామ కార్యదర్శిని ఎంపీడీవో ఆదేశించారు. సోమవారం గ్రామంలో యువతతో సమావేశం ఏర్పాటు చేసి, వాటిని పంపిణీ చేయాల్సిందిగా ఎమ్మెల్యే ఆదేశించారు.

బస్వాపూర్‌లో ముగిసిన క్రికెట్ పోటీలు

కోహెడ, జనవరి 27: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఈనెల 23న ప్రారంభమైన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. విజేత సజ్జు యూత్ జట్టుకు ట్రోఫీతో పాటు నగదు కింద రూ 10వేలు, రన్నర్స్ తాటిపాముల భరత్ జట్టుకు రూ5వేలు సాధించారు. వారికి సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య ట్రోఫీతో పాటు నగదును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మంద ధర్మయ్య, వార్డు సభ్యులు బండి సంపత్, గిరిధర్ కిష్టారెడ్డి, కటికం మల్లయ్య, మాజీ సర్పంచ్ తాటిపాముల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మంకాల అంజయ్య, మాజీ ఎంపీటీసీ కొక్కుల సురేష్, బీజేపీ గ్రామ అధ్యక్షుడు పుల్లూరు నవీన్ చారి, బూర్గుల శ్రీనివాస్, తాటిపాముల తిరుపతి, తుపాకుల రవి, ముజ్జు, జాంగిర్, నసీర్, బూర్గుల శ్రీనివాస్, తిరుపతి పాలెం శ్రీనివాస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో సర్పంచులకు గౌరవం లేదు: కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హుస్నాబాద్, జనవరి 27: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సర్పంచ్‌లకు కనీసం గౌరవం ఇవ్వలేదనేది మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. శనివారం హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై వొడితెల సతీష్‌కుమార్ చేసిన ఆరోపణలను ఖండించారు. ప్రస్తుతం సర్పంచ్‌ల గురించి సతీష్‌కుమార్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు మరచిపోవద్దన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన సొంత చరిష్మాతో రాజకీయంగా ఎదిగిన నాయకుడని, అధికారంలో లేకున్నా కార్యకర్తలను తన గుండెల్లో పెట్టుకున్న నాయకుడన్నారు. పొన్నం ప్రభాకర్ తెలంగాణ రాష్ట్రానికి మంత్రి అని, ఒక్క హైదరాబాద్‌కే కాదన్నారు. రాజుల పాలన అంటూ మంత్రిపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని, మీ దొరల పాలన వద్దనే మిమ్మల్ని ప్రజలు ఓడించారన్నారు. ఇప్పటికైనా అనవసరమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ నాయకులు చిత్తారి రవీందర్, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల పార్టీ అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, మంద ధర్మయ్య కౌన్సిలర్లు చిత్తారి పద్మ, యాదవరెడ్డి, నర్సాగౌడ్ తదితరులున్నారు.